నమస్తే తెలంగాణ
నిజామాబాద్, గురువారం 15 ఆగస్టు 2024
THURSDAY, AUGUST 15, 2024

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత

మొక్కలు నాటుతున్న పోలీసులు, లయన్స్ క్లబ్ సభ్యులు

రుద్రూర్, ఆగస్టు 14 : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్, ఆహారశాస్త్ర, సాంకేతిక విజ్ఞాన కళాశాల, ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. పాఠశాల ఆవరణలో ట్రాక్టర్ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించి, వర్షపు నీరు నిల్వకుండా గుంతలను పూడ్చివేయించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి, సుమారు 60 మొక్కలు నాటారు. కార్యక్రమంలో రుద్రూర్ ఎస్సై అప్పారావు, సిబ్బంది, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఫుడ్ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ సాయిప్రసాద్, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు కేవీ మోహన్, శ్యాంసుందర్ పహాడే, లింగాల శంకర్, ప్రశాంత్ గౌడ్, గాండ్ల మధు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం రూ. 44 లక్షలు విడుదల

కోటగిరి, ఆగస్టు 14 : ఉమ్మడి కోటగిరి మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ తెలిపారు. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు గడవడం, నిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. కోటగిరి మండలంలోని 28 జీపీలకు రూ.44,86,381 విడుదలైనట్లు వెల్లడించారు.

నగరంలోని వినాయకకల్యాణ మండపంలో విభజన గాయాల స్మారక దినాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. అఖండ భారత్‌ను విడగొట్టిన పాపం కాంగ్రెస్ పార్టీ దేనన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సన్మానించారు. – వినాయక్‌నగర్, ఆగస్టు 14

రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకమండలి, జిల్లా చైర్మన్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో నిజామాబాద్ జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్ పాల్గొన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువతను అప్రమత్తం చేయాల్సిన అవసరముందని గవర్నర్ సూచించారని పేర్కొన్నారు. – ఖలీల్‌వాడి, ఆగస్టు 14

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- అదనపు కలెక్టర్ అంకిత్
- డిచ్‌పల్లి, ఇందల్వాయి దవాఖానల తనిఖీ

డిచ్‌పల్లి/ ఇందల్వాయి, ఆగస్టు 14 : మండలకేంద్రంలోని సీహెచ్‌సీ దవాఖానను అదనపు కలెక్టర్ అంకిత్‌రాజ్ బుధవారం తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆరోగ్య కార్యకర్తలు పనితీరును మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. దోమల నియంత్రణకు గ్రామస్థాయిలో కమిటీగా ఏర్పడి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఘన్‌పూర్ గ్రామంలో పర్యటించి వీధుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, ఎంపీడీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాగరాజు, ఆనంద్, సందీప్‌రెడ్డి ఉన్నారు.

ఇందల్వాయి మండలకేంద్రంలోని పీహెచ్‌సీని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. డెంగీ వ్యాధి ప్రబలిన రోగులు, వారి గ్రామాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషెంట్‌లో జ్వరం పేషెంట్ల ప్రత్యేక రిజిస్టర్‌ను పెట్టాలని, నివేదికను అందజేయాలని సూచించారు. గన్నారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన పరిశీలించి, డెంగీ కేసుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, ఎంపీడీవో రాజ్‌కాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జేమ్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

బంద్ ప్రశాంతం

నగరంలో మూసి ఉన్న దుకాణాలు

వినాయక్‌నగర్, ఆగస్టు 14 : బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన నిజామాబాద్ నగర బంద్ ప్రశాంతంగా ముగిసింది. పలు ఏరియాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో పాటు వివిధ సంఘాల నాయకులు, షాపులు మూసివేయించారు. అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతున్నాయని, మనదేశంలో సెక్యూలర్ అని చెప్పుకునే జాతీయ, ప్రాంతీయ పార్టీలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో బీజేవైఎం ఆధ్వర్యంలో దుకాణాలు బంద్ చేయించే యత్నం చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. బైక్‌లపై ర్యాలీగా వెళ్లేందుకు పలువురు యత్నించగా నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో బైక్‌లపై వెళ్లడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ఏసీపీతో అనడంతో అక్కడ ఉన్న బీజేపీ నాయకులు ఏసీపీతో వాగ్వాదానికి దిగారు. బైక్‌లపై వెళ్లడానికి వీలు లేదని, నడుచుకుంటూ వెళ్లాలని ఏసీపీ తేల్చిచెప్పారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్, ఆగస్టు 14: మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో వ్యాపార సముదాయాలు, హోటళ్లను స్వచ్ఛందంగా మూసి ఉంచారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. జిల్లాకేంద్రంలోని కోర్టు భవనం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. – వినాయక్‌నగర్, ఆగస్టు 14

పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి

ఖలీల్‌వాడి, ఆగస్టు 14 : సపాయి కర్మచారి పారిశుద్ధ్య కార్మికులు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సపాయి కర్మచారి ఆందోళన్ స్వచ్ఛతా సంస్థ రాష్ట్రకార్యదర్శి కమ్మరి సరస్వతి అన్నారు. నగరంలోని ఆనంద్‌నగర్‌లో వాల్మీకి కమ్యూనిటీ భవన్‌లో పారిశుద్ధ్య కార్మికులు, వారి పిల్లలకు విద్యాప్రాముఖ్యతపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 15 ఏండ్లలో సెప్టిక్ ట్యాంకు, డ్రైనేజీ మ్యాన్ హోళ్లలో దిగి శుభ్రం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు 42 మంది కార్మికులు మరణించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.30 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. కళాకారులు నృత్య ప్రదర్శనలో రూపంలో చదువు ప్రాముఖ్యతను వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, ఆగస్టు 14 : డైట్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సోషియాలజీ, గణితం, వ్యాయామ విద్య, కళా విద్యా (ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో) బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంఈడీ, ఎంపెడ్, ఎంఎఫ్ఏ, డీఏ ఫ్‌ఏ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఈనెల 21 వరకు డైట్ కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంఐఎం నాయకులు, కార్పొరేటర్లు

కంఠేశ్వర్, ఆగస్టు 14 : నగరంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని జిల్లా ఎంఐఎం నాయకులు, కార్పొరేటర్లు కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సారంగపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని ఓ కార్పొరేటర్ కబ్జా చేసి, గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి సాయంతో ఓపెన్ ప్లాట్లుగా మార్చారని ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సొసైటీలో అవకతవకలపై విచారణ

- పాలకవర్గం హాజరుకాకపోవడంతో నిలిచిన విచారణ

సిరికొండ, ఆగస్టు 14 : సిరికొండ ప్రాథమిక సొసైటీలో జరిగిన అవకతవకలపై జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీ సీనియర్ ప్రత్యేకాధికారి పోశన్న బుధవారం విచారణకు వచ్చారు. సొసైటీలో అప్పటి చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యదర్శులు హాజరుకాకపోవడంతో విచారణను నిలిపివేశారు. నోటీసులు అందజేసినా విచారణకు హాజరుకాలేదని, మళ్లీ నోటీసులు జారీచేసి విచారణ చేపడతామని ఆయన తెలిపారు.

కోటగిరి ఏఎంసీ పాలకవర్గం నియామకం

కోటగిరి, ఆగస్టు 14 : కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గాయక్వాడ్ హన్మంతు (సుంకిని), వైస్ చైర్మన్‌గా అనిల్‌కుమార్ (కోటగిరి)తో పాటు పాలకవర్గాన్ని నియమిస్తూరాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పాలకవర్గం 2026 వరకు కొనసాగనున్నది. సూదం సాయిలు, మహ్మద్ ఖాలిక్ హైమద్, మాలోత్ యశ్వంత్, పి.పావని, ఎడ్డెడి శంకర్, సయ్యద్ హమీద్, గంట్ల శ్రీకాంత్, పుప్పాల గంగారాం, గాయక్వాడ్ జగన్నాథారావు, దేగల్‌వాడే శంకర్, అల్లం శ్రీనివాస్, రొట్టె రవి కిరణ్‌తోపాటు చైర్మన్ పీఏసీఎస్ (కోటగిరి), జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ –నిజామాబాద్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ –బోధన్, ప్రత్యేకాధికారి –కోటగిరి పాలకవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

బ్రాహ్మణపల్లివాసికి సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అవార్డు

జక్రాన్‌పల్లి/ఏర్గట్ల/మాక్లూర్, ఆగస్టు 14 : జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఇనుగంటి రాజశేఖర్ బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ నేషనల్ ఆచీవర్ అవార్డును బుధవారం అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోషల్ జస్టీస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అవార్డులను అందజేశారు. సోషల్ జస్టీస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్‌గా చేసిన సేవలను ఆయన అవార్డులను అందుకున్నారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్‌కు చెందిన సోషల్ జస్టీస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ కట్కం సామంత్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కైరి నరేశ్‌గౌడ్, ఏర్గట్లకు చెందిన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కె.గంగాధర్‌కు మాక్లూర్ మండలంలోని కల్లెడికి చెందిన పురం మోహన్‌కు అవార్డు అందుకున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

- ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి

వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

ఖలీల్‌వాడి, ఆగస్టు 14 : సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సూచించారు. బుధవారం కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వ్యాధులు ప్రబలకముందే క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. పల్లెలు, పట్టణాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ, పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డీపీవో చక్రవర్తి, తరుణ్‌కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

బాల్కొండ, ఆగస్టు 14: చిట్టాపూర్‌లో జరిగిన చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై యాసిర్ అర్ఫత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. గతనెల 19న పుంచేటి లింగన్న ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం నిందితులు నాందెడ్ జిల్లాకు చెందిన మున్కర్ నాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్, మహాదేవ్ అలియాస్ శివను ఆర్మూర్ జంబిహనుమాన్ ఆలయం వద్ద పట్టుకున్నారు. వారిని విచారించగా చిట్టాపూర్‌లో చోరీ చేసినట్లు నేరం ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఆరు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రెండు తులాలు మణప్పురం గోల్డ్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని, డిపాజిట్ చేసిన బంగారాన్ని లీగల్‌గా విడిపించే ప్రయత్నం చేస్తామని సీఐ వెల్లడించారు. నిందితుడి మున్కర్ నాందేవ్‌తోపాటు చోరీకి సహకరించిన మహాదేవ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మున్కర్ నాందేవ్‌పై గతంలో వేల్పూర్, మోర్తాడ్, బాల్కొండ, ఆర్మూర్, భీమ్‌గల్, బాన్సువాడ పోలీస్ స్టేషన్లలో పాత కేసులున్నాయని తెలిపారు. జైలు నుంచి వచ్చిన రెండు రోజులకే చిట్టాపూర్‌లో చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బంధువుల ఇండ్లకు వెళ్లేటప్పుడు పోలీసులు, చుట్టుపక్కల వారికి సమాచారం అందించాలని కార్యక్రమంలో ఏఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజీహెచ్‌ఎస్ వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

వినాయక్‌నగర్, ఆగస్టు 14 : జిల్లాకేంద్రంలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ వివిధ శాఖలకు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ సంక్షేమ సమన్వయ కమిటీ తరఫున ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖకు లేఖ రాశామని ఎంపీ వారికి తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ధర్పల్లి ఎస్సైగా రామకృష్ణ** - ధర్పల్లి, ఆగస్టు 14 : ధర్పల్లి ఎస్సైగా జాడి రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్సైగా పనిచేసిన విక్రం జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ ఎస్సైగా బదిలీ కాగా.. జగిత్యాల్ జిల్లా సీఎస్ నుంచి బదిలీపై రామకృష్ణ ఇక్కడికి వచ్చారు.
- **ఏకరూప దుస్తుల పంపిణీ** - కోటగిరి, ఆగస్టు 14 : మండలంలోని యాద్గార్‌పూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 37 మంది విద్యార్థులకు హెచ్‌ఎం అఫ్సర్‌ఖాన్ ఏకరూప దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. జెండా పండుగకు ఒక రోజు ముందుగా దుస్తులు పంపిణీ చేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఐకేపీ వీవోఏ శోభ తదితరులు పాల్గొన్నారు.
- **మొక్కల పరిశీలన** - కోటగిరి, ఆగస్టు 14 : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉపాధి సిబ్బంది నాటుతున్న మొక్కలను ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ బుధవారం పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా నాటాలని సూచించారు. ఎక్లాస్‌పూర్‌లో వన నర్సరీ, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు.
- **ఎన్నికలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన** - డిచ్‌పల్లి, ఆగస్టు 14 : మండలంలోని సుద్దపల్లిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఎన్నికలు, నాయకత్వ లక్షణాలు, ఎన్నికల్లో సరైన వ్యక్తులను ఎన్నుకోవడం అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం నళిని ఆధ్వర్యంలో కళాశాల కెప్టెన్, వైస్‌కెప్టెన్, కల్చరల్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లిటరరీ సెక్రటరీ ఎన్నికలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.
- **ఆయుర్వేద వైద్య శిబిరం** - జక్రాన్‌పల్లి, ఆగస్టు 14 : మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలో పడకల్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వృద్ధాప్య వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆయుర్వేద మందులను అందజేసినట్లు మండల ఆయుర్వేద వైద్యాధికారిణి లలిత తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ నారాయణ, డీపీఎం వందన, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.
- **టై, బెల్టుల పంపిణీ** - సిరికొండ, ఆగస్టు 14 : మండలంలోని రావుట్ల ప్రాథమిక పాఠశాలలో 100 మంది విద్యార్థులకు టై, బెల్టలను సొసైటీ డైరెక్టర్ బాబన్న, బాలకిషన్ బుధవారం పంపిణీ చేశారు. దాతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ హెచ్‌ఎం సోలోమాన్, హెచ్‌ఎం విజేత అభినందించారు.
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం** - సిరికొండ, ఆగస్టు 14 : మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన సందీప్‌గౌడ్ 20 రోజుల క్రితం గల్ఫ్‌లో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గడ్కోల్ గల్ఫ్ యూనియన్ ప్రతినిధులు రూ. 40 వేలు, 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ. 35 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు.
- **ధర్మ పరిరక్షణకు అందరూ బాధ్యత వహించాలి** - శక్కర్‌నగర్, ఆగస్టు 14: ధర్మ పరిరక్షణనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. బుధవారం రాత్రి బోధన్ పట్టణంలోని మారుతీ మందిరం కాంప్లెక్స్‌లో హనుమాన్ వ్యాయామశాలను ఆయన ప్రారంభించారు.
- **మంగళ్‌పాడ్ లో బ్యాంక్ ఏర్పాటు**- ఎడపల్లి, ఆగస్టు 14: మంగళ్‌పాడ్ గ్రామంలో కెనరా బ్యాంకు బ్రాంచిని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ చూపిన గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను బ్యాంకు మేనేజర్ శ్రావన్ అందించారు.
- **'ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి'**- ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: ఎంఈవో రాజగంగారాంపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌వీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ ఎదుట బుధవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య కళాశాల, స్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందని అన్నారు. ఆ స్కూల్‌పై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.
- **సీజనల్ వ్యాధులపై అవగాహన** - మాక్లూర్, ఆగస్టు 14: దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ ప్రకాశ్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.
- **పాఠశాలకు మైక్‌సెట్ వితరణ**- రెంజల్, ఆగస్టు 14: నీలా జడ్పీ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ అచన్‌పల్లి, ఉపాధ్యాయులు సంయుక్తంగా మైక్ సెట్ వితరణ చేసినట్లు హెచ్‌ఎం ఇల్తేపు శంకర్ బుధవారం తెలిపారు.
- **విద్యార్థులకు షూ వితరణ**-మోర్తాడ్, ఆగస్టు14: ఎస్సీ, బీసీ కాలనీ మోర్తాడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికి పీఆర్టీయూ మోర్తాడ్ మండల అధ్యక్షుడు మగ్గిడి ప్రవీణ్ తన సొంత డబ్బుతో షూ, సాక్స్‌ను కొనుగోలు చేసి ఇవ్వగా బుధవారం అందజేశారు.
- **అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన**- భీమ్‌గల్, ఆగస్టు 14: అగ్ని ప్రమాదాల నివారణపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్1, యూనిట్ 2 ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలు మృతిచెందగా.. వారి కుటుంబాలకు పార్టీ అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ సాంక్షన్ ఆర్డర్ కాపీలను బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ సోమ భరత్‌కుమార్ బుధవారం అందజేశారు.

భీమ్‌గల్ మండల స్త్రీనిధి మేనేజర్ సురేశ్ రాష్ట్రస్థాయి బెస్ట్ స్త్రీనిధి మేనేజర్‌గా ఉత్తమ అవార్డులను రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. – భీమ్‌గల్, ఆగస్టు 14

నాటిన మొక్కలను రక్షించుకుందాం

రెంజల్, ఆగస్టు 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను కాపాడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్‌హుసేన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం వద్ద మొక్కలకు ఆయన నీరు పోశారు. అంతకు ముందు బాగేపల్లి శివారులో పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి పరిగె లక్ష్మీ కాంత్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

రైతు వేదిక వద్ద మొక్కను నాటుతున్న జేడీఏ వాజిద్‌హుస్సేన్

ఘనంగా తీజ్ పండుగ

ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గిరిజన తండాలో తీజ్ పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. తండా యువతులు వెదురు బుట్టల్లో తొమ్మిది రోజుల పాటు పెంచిన గోధుమ మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. తండావాసులు తిరుపతి నాయక్, భీమా నాయక్, భూక్యా సంతోష్ నాయక్, దయానంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. – ఏర్గట్ల, ఆగస్టు14

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్, ఆగస్టు14: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం పర్యటించారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మాక్లూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నారు.

బోధన్ జిల్లా దవాఖాన తనిఖీ

బోధన్, ఆగస్టు 14: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని బోధన్ తహసీల్దార్ విఠల్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు. బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు వారు బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. దవాఖాన పక్కనే ఉన్న ఆర్ఎంవో కార్యాలయం నిరుపయోగంగా ఉన్నందున ఆ భవనాన్ని డయాలసిస్ కేంద్రానికి వినియోగించుకోవాలని వైద్యులతో చర్చించారు. అనంతరం జిల్లా దవాఖాన భవనంపైన నర్సింగ్ విద్యార్థుల కోసం షెడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటి ఏర్పాటు కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్యేకు నివేదిస్తామన్నారు. బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బి.గంగాశంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, వైద్యులు, సిబ్బంది, నాయకులు ఉన్నారు.

బాలుడిపై కుక్కదాడి

గాయపడిన బాలుడు

శక్కర్‌నగర్, ఆగస్టు14: బోధన్ పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. బుధవారం ఉదయం శర్బతీ కెనాల్ వద్ద ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. ఉస్మాన్ ఘనీయుద్దీన్ అనే నాలుగేండ్ల బాలుడిని వారి తల్లిదండ్రులు పాఠశాలకు పంపేందుకు సిద్ధంచేసి పాఠశాల బస్సు కోసం వేచి చూస్తున్నారు. కుక్క అకస్మాత్తుగా వచ్చి బాలుడిని కరిచింది. బాలుని తండ్రి మహ్మద్ బషీరుద్దీన్‌తోపాటు అక్కడే ఉన్న పలువురు కుక్కను తరిమివేశారు. బాలుడికి భుజంపై, మరో మూడు చోట్ల గాయాలయ్యాయి. బాలుడి తండ్రి ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశాడు. అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరారు.

వరద కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య

సాయికుమార్(ఫైల్)

మోర్తాడ్, ఆగస్టు14: మండల కేంద్రానికి చెందిన బోగ సాయికుమార్(29) గాండ్లపేట్ శివారులోని వరద కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన సాయికుమార్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాండ్లపేట్ శివారులో వరద కాలువలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు బుధవారం బయటికి తీయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువతి..

రెంజల్, ఆగస్టు 14: కందకుర్తి వద్ద గోదావరిలో గుర్తు తెలియని యువతి బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. కందకుర్తి పుష్కర ఘాట్ వద్దకు స్కూటీపై చేరుకున్న యువతి అక్కడే సెల్ ఫోన్, చెప్పులు వదిలి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. ఎస్సై సాయన్నను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ఎంపీవో రామకృష్ణకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

నవీపేట, ఆగస్టు 14: ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు నాయక్‌వాడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఆంజనేయులు, కారోబార్ల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నెలకు రూ.పదివేల వేతనం అందజేయాలి

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు14: స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.పదివేల వేతనం ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బోధన్‌లో ఆక్యుప్రెషర్ శిబిరం ప్రారంభం

ఆక్యుప్రెషర్ శిబిరం ప్రారంభిస్తున్న వైద్యులు

శక్కర్‌నగర్, ఆగస్టు 14: బోధన్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ వారిచే బుధవారం ఆక్యుప్రెషర్ శిబిరాన్ని ప్రారంభించారు. పాత బస్టాండ్‌లోని శ్రీ చైతన్య వొకేషనల్ కళాశాలలో ఈ శిబిరాన్ని వారం రోజుల పాటు రాజస్థాన్‌కు చెందిన ప్రత్యేక వైద్య, నిపుణులు నిర్వహిస్తారని క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి..భార్యాభర్తలపై కేసు

నవీపేట, ఆగస్టు 14: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ రుడవత్ రెడ్యాపై దాడి చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన శ్రీనివాస్, లక్ష్మి దంపతుల కూతురు స్పందన నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం నిజామాబాద్–2 డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో డ్రైవర్ రుడవత్ రెడ్యా, కండక్టర్ సరస్వతి నిజామాబాద్ నుంచి ప్యాసింజర్‌ను ఎక్కించుకొని నందిగామకు వెళ్తున్నారు. మార్గమధ్యలో నాగేపూర్ బస్‌స్టాప్ వద్ద డ్రైవర్ బస్సును ఆపాడు. బస్సులో సీట్లు లేవని వెనుక బస్సులో రావాలని విద్యార్థులకు చెప్పాడు. అప్పటికే బస్సు ఎక్కిన విద్యార్థిని స్పందన ఎందుకు ఆపడం లేదంటూ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. డ్రైవర్‌కు, విద్యార్థులతో కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. బస్సు దిగి ఇంటికి వెళ్లిన స్పందన అనే విద్యార్థిని తన తల్లిదండ్రులకు విషయం తెలిపింది. బస్సు డ్రైవర్ తనను తిట్టాడని చెప్పింది. మద్దేపల్లి వెళ్లి తిరిగి వస్తున్న బస్సును విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాస్, లక్ష్మి ఫకీరాబాద్ వద్ద ఆపి డ్రైవర్‌పై దాడి చేశారు. విధులకు ఆటంకం కలిగించారు. భార్యాభర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.